క్లుప్తంగా

స్కూల్ కాంప్లెక్స్ ఫలితాల మెరుగుకు కృషి



ఉపాధ్యాయులకు కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

సిద్దవటం : స్కూల్ కాంప్లెక్స్ ఫలితాలు మెరుగయ్యేందుకు సమగ్ర శిక్ష ద్వారా కృషి చేస్తామని అకడమిక్ మానిటరింగ్ అధికారి వీరేంద్రరావ్ యాదవ్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎంలపై ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అకడమిక్ మానిటరింగ్ అధికారి వీరేంద్ర రావ్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫండమెంటల్ లిటరసీ, న్యూమరసీ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కో–ఆర్డినేటర్ లక్ష్మీ నరసింహ రాజు, ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై చర్చ



సమావేశంలో చర్చిస్తున్న నాయకులు, అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండల సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన ఎమ్మెల్యే అరవశ్రీధర్ హాజరయ్యారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, తాగునీరు వంటి సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, అధికారులు, ఎంపీటీలు, సర్పంచులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

సంబేపల్లె : ఆంగ్ల భాషాభివృద్ధి కోసం విద్యార్థులకు క్విజ్ పోటీలు దోహద పడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం ఆంగ్ల ఉపాధ్యాయులు దేవప్రసాద్‌రెడ్డి, విజయభాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆంగ్లంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పదజాలం, వ్యాకరణం, స్పెల్లింగ్ తదితర అంశాలపై నిర్వహించిన క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పొలాల పరిశీలన



చిన్నమండెం మండలంలో పొలాలను పరిశీలిస్తున్న డీపీఎం వెంకటమోహన్

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు, కొత్తపల్లి, చాకిబండ, చిన్నర్సుపల్లె పంచాయతీలలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పొలాలను జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.వెంకట మోహన్ శనివారం పరిశీలించారు. అనంతరం సిబ్బందితో చిన్నమండెంలో ఆర్ఎస్‌కెలో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయపరంగా ఇంకా ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంటీఎల్, ఎంటీలు, మోడల్ మేకర్స్, యూనిట్ ఇంచార్జీలు, డిజిటల, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఐటీఐతో ఉద్యోగ అవకాశాలు



విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్‌లు

రాజంపేట రూరల్ : ఐటీఐ సర్టిఫికెట్ పొందిన వారికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమణరాజు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రిన్సిపల్ రామమూర్తి ఆధ్వర్యంలో శనివారం ఐటీఐలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు కాన్వొకేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ రమణరాజు విద్యార్థులకు సర్టిఫికెట్‌లను రామమూర్తితో కలిసి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆదిప్రసాద్, అధ్యాపకులు వేంకటేశ్వర్లు, ఉషా, గంగయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వాన.. వరద

- మాండవ్య నదిపైన తెగిపోయిన కాజ్‌వే
- ప్రజల రాకపోకలకు ఇక్కట్లు
- ఒంటిమిట్ట చెరువుకు నీరు



సంబేపల్లె : అలుగు పారుతున్న జరికోన

వీరబల్లి : మండలంలో గతంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు, అదే విధంగా చుట్టు పక్కల ప్రాంతాలలో కురిసిన అధిక వర్షాలకు మాండవ్య నది ప్రవహించడం జరిగింది. దీంతో మాండవ్య నదిపైన నిర్మించిన తాత్కాలిక కాజ్‌వే పూర్తిగా తెగిపోవడంతో అటు ప్రయాణికులు, ఇటు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఈ కాజ్‌వేలు మట్టితో పైపులు వేసి నిర్మించడంతో మాండవ్య నది అధికంగా ప్రవహించడంతో పూర్తిగా తెగిపోవడం జరిగింది. ఓదివీడు, రాగిమాను దిన్నెపల్లె, వీరబల్లి మండల కేంద్రం సమీపంలోని మాండవ్య నదిపై తాత్కాలిక కాజ్‌వేలు తెగిపోవడం జరిగింది. దీంతో ప్రజలు, ప్రయాణికులు మండల కేంద్రానికి రావడానికి అనేక ఇబ్బందులకు గురయ్యారు. అలాగే ప్రతి ఏడాది వర్షం వచ్చినప్పుడల్లా నది ప్రవహించడంతో తాత్కాలిక కాజ్‌వేలు కొట్టుకొని పోవడం జరుగుతుంది. శాశ్వతంగా మాండవ్య నదిపై బ్రిడ్జిలు నిర్మిస్తే ఈ సమస్యలు తలెత్తవని పలువురు అంటున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పేరు ప్రకటించడంతో పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్తులు నదిలో ఉన్న ఇసుకను అడుగుభాగాన తీసుకెళ్లడంతో నీరు అధికంగా రావడంతో ఈ కాజ్‌వేలు కొట్టుకొని పోవడం జరిగిందని ప్రజలు, రైతులు వాపోతున్నారు. నదిలో ఇసుక ఉంటే నీరు నిలబడుతుందని, నీటి ప్రవాహం తగ్గుతుందని ప్రజలు తెలుపుతున్నారు. అలాంటిది నదిలో ఇసుకే లేకపోతే నీరు నిలబడకుండా తాత్కాలిక కాజ్వేపై ఒత్తిడి వచ్చి కొట్టుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

అలుగు పారుతున్న జరికోన

సంబేపల్లె : మండల సరిహద్దులోని బహుదానదిపై నిర్మించిన జరికోన ప్రాజెక్టు అలుగు పారుతుంది. గత కొద్దిరోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షానికి జరికోన నిండి దిగు ప్రాంతానికి వర్షపు నీరు వెళ్తోంది. గత నాలుగురోజులుగా మండల వ్యాప్తంగా 232 మి.మీ వర్షం కురిసినట్లు అధికార గణాంకాలు తెలుపుతున్నాయి. మండల వ్యాప్తంగా పలు గ్రామాలలోని చెరువులు, వాగులు, వంకలలో పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరుతోంది.

ఒంటిమిట్ట చెరువుకు నీరు

ఒంటిమిట్ట : కడప జిల్లాలోని అతిపెద్ద చెరువులలో ఒకటైన ఒంటిమిట్ట చెరువుకు శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి వరదనీరు వచ్చి చేరుతోంది. సుమారు ఐదు సంవత్సరాలుగా ఒంటిమిట్ట చెరువులో నీరు లేక బోరు బావుల్లో నీటి శాతం తగ్గిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం పైపులైన్ సమస్యతో కొట్టుమిట్టాడుతున్న కుడమలూరులోని శ్రీరామ ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతారనే నమ్మకం మండల రైతుల్లో నశించిపోయింది. ఆశలన్నీ ఆవిరైపోయిన సమయంలో ఎడారిలో నీటి కుంటలు కనిపించినట్లు.. ఎండిపోయిన ఒంటిమిట్ట చెరువును ప్రభుత్వం కరుణించకపోయినా ఎట్టకేలకు వరుణదేవుడు కరుణించి నీరు అందించాడు. చెరువుకు వస్తున్న వర్షపు వరదనీటిని చూసి రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

'పాలకుల తప్పిదంతోనే నలుగురి మృతి'

రాయచోటి : పాలకుల తప్పిదాల కారణంగానే రాయచోటి పట్టణంలో నలుగురు మృతి చెందారని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఆరోపించారు. శనివారం పట్టణంలో వరద ప్రాంతాల్లో సీపీఎం నాయకులు పర్యటించారు. కబ్జాదారులు, కాలువల మీద అక్రమ నిర్మాణాలు చేపట్టడం, పాలకుల ఉదాసీనత, అధికారుల మామూళ్ల వ్యామోహంతో అక్రమ కట్టడాలు విచ్చలవిడిగా వెలిశాయన్నారు. వర్షం నీటి ఉధృతి తీవ్రంగా పెరిగి నలుగురు మృతిచెందారని తెలిపారు. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇష్టారాజ్యంగా మట్టిపై సిమెంట్ వేసి నాణ్యత లేని రోడ్లు వేశారని, చిన్న చిన్న డ్రైనేజీ కాలువలు నిర్మించారని ఫలితంగా వర్షం నీరు ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. కొత్తపల్లిలోని లోతట్టు ప్రజలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని అధికారులను హెచ్చరించారు. ఎస్ఎన్ కాలనీలో ముగ్గురి మరణానికి కారణమైన మురుగునీటి కాలువ మీద సీలింగ్ వేయకపోవడమేనని తెలిపారు. ప్రభుత్వ అధికారుల తప్పిదాలకు అకాల మరణం చెందిన వారికి ప్రభుత్వం సాయం రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, శాఖ కార్యదర్శి జి.మాధవయ్య, స్థానికులు ఆరోపించారు.

పత్తివాండ్లపల్లె ప్రజల ప్రాణాలు కాపాడండి

సుండుపల్లె : మండల పరిధిలోని పత్తివాండ్లపల్లె సమీపంలో ఉన్న తుమ్మానివంకకు రక్షణ గోడ నిర్మించి పత్తివాండ్లపల్లె ప్రజల ప్రాణాలు కాపాడాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి శనివారం ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత పక్షం రోజుల క్రితం భారీ వర్షాల కారణంగా తుమ్మానివంకకు వరదనీరు వచ్చి వంకకు రక్షణగా ఉన్న మట్టి కట్ట (కరకట్ట)కు గండిపడి లోతట్టుగా ఉన్న పత్తివాండ్లపల్లె గ్రామంలోని గృహాల్లోకి వరదనీరు చేరి ప్రజలకు ఆస్తినష్టం వాటిల్లిందని, కోళ్లు వరదలో కొట్టుకుపోయాయని ఆయన తెలిపారు. ఆ రోజు రాత్రంతా ప్రజలంతా బిక్కుబిక్కుమని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉన్నారని పేర్కొన్నారు. ఇటీవల నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మళ్లీ గ్రామంలోకి వంకనీరు ప్రవహిస్తుందని తెలిపారు. ఈ వరదనీరు వ్యవసాయ భూములు మీద పడి పంటలు కొట్టుకుపోయి రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి తోటలు వరదనీటి కోతకు గురై రైతులు నష్టపోతున్నారని తెలిపారు. బ్రిడ్జి దెబ్బతిన్నడంతో గ్రామ ప్రజలు బయటి ప్రపంచానికి రాకపోకలు లేవని తెలిపారు. వంకనీరు వ్యవసాయ భూములు మీద పడి ప్రవహిస్తూ ఉందన్నారు. జిల్లా అధికారులు స్పందించి తమ్మాని వంకకు రక్షణ గోడ (ప్రొటెక్షన్ వాల్) నిర్మించాలని రోడ్డు, బ్రిడ్జిలకు మరమ్మతులు వెంటనే చేసి ప్రజల అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పరిసరాల శుభ్రత.. ఆరోగ్య భద్రత



స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న కమిషనరు శ్రీనివాసులు

సంబేపల్లె : పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం సంబేపల్లె మండల కేంద్రంలో నిర్వహించిన స్వర్ణ అంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పారిశుధ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థులు, అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీ

రాజంపేట : రాజంపేటలో స్వర్ణ అంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. మున్సిపాలిటి కమిషనరు శ్రీనివాసులు ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ ర్యాలీ మున్సిపాలిటీ ఆవరణం నుంచి ఆర్అండ్‌బీ బంగ్లా వరకు ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో సచివాలయ, మున్సిపాలిటీ, మెప్మా, ఎక్సైజ్ డిపార్టుమెంట్, హెల్త్ డిపార్టుమెంట్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపాలిటి కార్యాలయంలో కంట్రోల్ రూం

మున్సిపాలిటీ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని కమిషనరు అన్నారు. వరదల వల్ల ఇబ్బందులు వస్తే వెంటనే 9989051977 నంబర్‌కు సంప్రందించాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. 21 నుంచి 22 వరకు భారీ వర్షాలు ఉన్న కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అప్రమత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పుల్లంపేట : దళవాయిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుడు రమణ విద్యార్థుల చేత మొక్కలు నాటించారు.

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి



గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేవీవీ నాయకులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

రాయచోటి జగదాంబసెంటర్ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబాఫకృద్దీన్ మాట్లాడుతూ తెలుగు సాహిత్య కవితా పితామహుడు, మహాకవి గురజాడ అప్పారావు అని తెలిపారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర, జేవీవీ నాయకులు రవీంద్రారెడ్డి, ఆంజనేయులు, ప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

సిద్దవటం : మండలంలోని భాకరాపేట సమీపంలోని ఏపీఎస్‌పీ 11వ బెటాలియన్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గురజాడ అప్పారావు ముందస్తు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం షామీర్ బాష మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గురజాడ జయంతిని ప్రతి ఏడాది సెప్టెంబర్ 21న అధికారికంగా నిర్వహించాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యూనస్, రామ సుబ్బారెడ్డి, సిరాజుల్లా, రవిశంకర్, పోతులూరయ్య, నరసింహులు, మౌలాలి, హేమంత్, మాధవిలత, రాజమ్మ, పరమేశ్వరీ, సుమతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



రణభేరి సదస్సు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గాలివీడు : కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాదిన్నర అవుతున్నప్పటికీ విద్యా రంగ, ఆర్థిక సమస్యలను పరిష్కరించకుండా నిస్తేజంగా ఉండడాన్ని నిరసిస్తూ, పాలకుల కళ్లు తెరిపించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఐదు రోజులు పాటు రాష్ట్ర వ్యాప్తంగా రణభేరి ప్రచార కార్యక్రమం చేపట్టడం జరిగింది. కానీ ఏమాత్రం చలనం లేదు. అందువల్ల ప్రభుత్వ మొండి వైఖరిని ఎండగట్టేందుకు ఈ నెల 25న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన కేంద్రంలో రణభేరి సదస్సును వేలాది మందితో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబీర్ తెలిపారు. ఈ క్రమంలో శనివారం గాలివీడులో యూటీఎఫ్ రణభేరి సదస్సు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫయాజున్నిస, మహేశ్వరయ్య, ఖాదర్ వలి, శివారెడ్డి, ఇర్షాద్, నాగరాజు, సయ్యద్ బాషా, సుబ్బరాయుడు, ప్రభాకర్, విజయ క్రిష్ణారెడ్డి, శ్రీరాములు నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ రాధమ్మ

కలకడ : ప్రతి పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారు కావాలని, అందుకోసమే ప్రత్యేక శిక్షణ ఇచ్చి చెత్త సేకరణపై దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారి రాధమ్మ ఆదేశించారు. శనివారం కలకడ సర్పంచ్ ప్యారీజాన్ అధ్యక్షతన కలకడ చెత్తసేకరణ కేంద్రం వద్ద రాయచోటి డివిజన్ పరిధిలోని 10 మండలాల సీఆర్‌పీలకు శిక్షణ ఇచ్చారు. తడిచెత్త సేకరణ వలన ప్రయోజనాలు, పొడిచెత్త సేకరణ వలన ప్రయోజనాలు, ప్లాస్టిక్ నివారణపై అవగాహన, కరగని ఘనపదార్థాల నిల్వ వంటివాటి గురించి డీపీఆర్‌ఓలు అష్రఫ్ అల్లి, రామ్మోహన్ కమ్యూనిటీ రీసోర్స్‌పర్సన్‌లకు శిక్షణ ఇచ్చారు. సేంద్రీయ ఎరువుల తయారీ, వర్మికంపోస్ట్ ఎరువుకు ఎక్కువగా డిమాండ్ ఉందని గుర్తు చేశారు. ప్రతి పంచాయతీలో శిక్షణ పొందిన సిఆర్‌పీలు గ్రీన్‌అంబాసిడర్‌లు తిరిగి శిక్షణ ఇచ్చి, ప్రతి ఇంటినుంచి చెత్త సేకరణ, సేకరణ చెత్తనుంచి ఎరువుల తయారీ వంటి వాటిపై శ్రద్ధపెట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ లక్ష్మిపతి, ఎంపీడీఓ భానుప్రసాద్, డిప్యూటి ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు,జావాద్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరులో వైఎస్సార్ సర్కిల్ వద్ద అపోలో ఆసుపత్రి వారు ఉచిత షుగర్, బీపీ పరీక్షలను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలకు ఉచితంగా షుగర్, బీపీ టెస్టు చేసే ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును రాజంపేట అపోలో సిబ్బంది ఏర్పాటు చేయడం జరిగింది.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పెనగలూరు : మండలానికి వచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులను శనివారం తహసీల్దార్ అమరేశ్వరీ డీలర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 43 మంది డీలర్లు ఉన్నారని అన్నారు. మండలానికి 11,515 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఆదివారం నుంచి గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేయాలని డీలర్లుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవి, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఉత్పత్తుల మేళా

మదనపల్లె: స్థానిక సొసైటీకాలనీ రామాలయంలో శనివారం టింబక్ట్ ఆర్గానిక్ ఉత్పత్తుల మేళా ప్రారంభమైంది. నిర్వాహకులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రజల నుంచి స్పందన కనిపించింది. నిర్వాహకులు రాజశేఖర్, శంకర్ మాట్లాడుతూ సత్యసాయిజిల్లాలో రైతులు చిరుధాన్యాల పంటలను సాగుచేస్తున్నారని అన్నారు. ఈ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ఎన్నో వ్యాధులకు ఈ ఆహారం ఔషధంగా పనిచేస్తుందన్నారు. ధరణి వ్యవసాయ పరస్పర సహకార సంఘం తరపున రెండుజిల్లాల్లోని 10 మండలాల్లోని 80 గ్రామాల్లో 2,666 మంది రైతులతో 14,750 ఎకరాల్లో సేంద్రీయ పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. వీటికి మార్కెటింగ్, గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

దాతల సాయం అభినందనీయం

పీలేరురూరల్ : హాస్పిటల్ అభివృద్ధికి సాయం అభినందనీయమని పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రికి మండలంలోని రేగళ్లు పంచాయతీ కూరపర్తివారిపల్లెకు చెందిన బి. రాజారెడ్డి రూ. 60 వేలు విలువ చేసే 10 బెంచీలు, 10 స్టూల్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 129 మందికి ఉద్యోగాలు

మదనపల్లె రూరల్ : మండలంలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 129 మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ జే.రాజేంద్రప్రసాద్ తెలిపారు. మెగా జాబ్‌మేళాలో సుమారు 15 కంపెనీలకు పైగా పాల్గొన్నాయన్నారు. జాబ్‌మేళాకు 261మందికి పైగా నిరుద్యోగులు హాజరుకాగా, అందులో 129 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి నాగార్జున, అదనపు నైపుణ్య అభివృద్ధి అధికారి ఆరీఫ్, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

శ్రీ నారసింహుడికి పూజలు

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో తరిగొండ ఆలయంలో స్వామివార్లకు వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయఅర్చకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

రాజంపేట రూరల్ : జగద్గురు ఆది శంకరాచార్యమఠంలో కొలువు అయి ఉన్న జగన్మాత శారాదాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు అద్వైత సమితి అధ్యక్షులు ప్రగడరాజు వల్లభరావు తెలియజేశారు. స్థానిక పాత పోలీస్ లైన్ వీధిలోని జగద్గురు ఆది శంకరాచార్యమఠంలో శనివారం ఉత్సవాల ఆహ్వాన పత్రికలను అద్వైత సమితి ప్రతినిధులతో కలిసి వల్లభరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగద్గురు ఆది శంకరాచార్యులకు, శారాదామాతకు 9 రోజుల పాటు పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. గణపతి పూజలు, మంత్రపుష్పం, శారాదామాత దీక్ష వస్త్రధారణ, కుంకమపూజలను అనునిత్యం 9 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఈ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణలో అద్వైత సమితి కార్యదర్శి రాధాకృష్ణ, గౌరవ అధ్యక్షులు వంగిపురం శ్రీనివాస్, గౌరవ సలహాదారులు జయంతి నారాయణమూర్తి, మధుర భరతం సత్యనారాయణ, సోమయాజులు పద్మనాభం, మల్లికార్జున శాస్త్రి, మాధవరావు, నక్క సాయిప్రసాద్‌రావు, చరిపల్లి నారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికలు విడుదల

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆర్యవైశ్య సంఘం సభ్యులు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు ఎంబలూరు నరసింహస్వామి మాట్లాడుతూ అమ్మవారికి ఒక్కో రోజు ఒక్కో అలంకారం చేయనున్నట్లు తెలిపారు. 22న దీక్షబంధన అలంకారం, 23న పార్వతీదేవి, 24న గజలక్ష్మీదేవి, 25న కృష్ణమూర్తి, 26న తోటోత్సవం, మోహినీ, 27న మీనాక్షిదేవి, 28న గాయత్రీదేవి, 29న సరస్వతీదేవి, 30న మహిషాసురమర్దిని, అక్టోబర్ 1న అన్నపూర్ణాదేవి, 2న శమీ దర్శనం, గ్రామోత్సవం, రాత్రి రాజరాజేశ్వరిదేవి అలంకారం, 3న ఉదయం వసంతోత్సవం, రాత్రి ఊంజల సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళా మండలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సర్వమంగళా దేవి ఆలయంలో..

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని విశ్వభారతి పాఠశాల సమీపంలో వెలసిన శ్రీ సర్వమంగళా దేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు ఓబులేశ్వరమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు గొర్ల భూదేవమ్మ, గొర్ల మోహన్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరిస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22వ తేదీన బాలాత్రిపుర సుందరీ దేవి అలంకారం, 23న గాయత్రీ దేవి, 24న శ్రీ అన్నపూర్ణేశ్వరీ దేవి, 25న శ్రీ గౌరీ దేవి, 26న శ్రీ మహాలక్ష్మీదేవి, 27న శ్రీ లలితాంబికా దేవి, 28న శ్రీ సంతానలక్ష్మీ, 29న సరస్వతీ దేవి, 30న శ్రీ దుర్గాదేవి, అక్టోబర్ 1న శ్రీ మహిషాసుర మర్దినీదేవి, 2న శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. దసరా ఉత్సవాలకు సంబంధించి ప్రతిరోజూ కుంకుమార్చన, అభిషేకం, మంగళహారతి ఉంటుందని, కావున అమ్మవారికి ఉభయం సమర్పించే భక్తులు 9502639099, 9347855966 నంబర్లను సంప్రదించాలని కమిటీ సభ్యులు తెలిపారు.

అంగన్‌వాడీల హామీలు అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఏఐటీయూసీ, అంగన్ వాడీ వర్కర్స్ హెల్పర్స్ నాయకులు

రాయచోటి : అంగన్‌వాడీలకు 42 రోజుల సమ్మెకాలపు హామీలు, మినిట్స్ జీఓలు అమలు చేసి కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరీలు కోరారు. శనివారం రాయచోటిలోని ఏఐటీయూసి కార్యాలయంలో అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. అంగన్ వాడీలు చేసిన సుదీర్ఘ పోరాటానికి నేటి కూటమి ప్రభుత్వం మినిట్స్ కాపీ హామీలు అమలు చేయాలని కోరుతూ అనేక దపాలుగా స్థానిక ప్రజా ప్రతినిధులు, మంత్రులు, ముఖ్యమంత్రికి విన్నవించామన్నారు. నేటికీ ఏ ఒక్క సమస్యను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టకోవడం అన్యాయమని మండిపడ్డారు. ఖాళీగా ఉన్న అంగన్ వాడీ కార్యకర్తలు, హెల్పర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయుసి రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి బత్తల వెంకటరమణ, స్వర్ణకుమారి, శ్రీవాణి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు



విద్యార్థినికి జ్ఞాపిక బహూకరిస్తున్న కరస్పాండెంట్ సుబ్బయ్య

రాయచోటి జగదాంబసెంటర్ : దేశ భవిష్యత్తు నవతరం, యువత చేతుల్లోనే ఉందని, ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విద్య అభ్యసించి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని శ్రీ సాయి విద్యాసంస్థల కరెస్పాండెంట్ కేపీవీ సుబ్బయ్య పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణం మాసాపేటలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ట్రాఫిక్ సీఐ కుళ్లాయప్ప, గెస్ట్ ఆఫ్ హానర్‌గా ప్రసిద్ధ మోటివేషనల్ స్పీకర్ డీజీ రామమూర్తి పాల్గొన్నారు. వివిధ విభాగాల ప్రతిభావంతులైన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు బహూకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ వెంకటరమణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనిబిసెంట్ సేవలు మరువలేనివి



అనిబిసెంట్‌కు నివాళులర్పిస్తున్న బీటీ కళాశాల సిబ్బంది

మదనపల్లె రూరల్ : పట్టణంలో బెసెంట్ థియోసఫికల్ కళాశాల(బీటీసీ) స్థాపించి, స్థానికంగా విద్యాభివృద్ధికి కృషిచేసిన అనిబిసెంట్ సేవలు మరువలేనివని బీటీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్.శ్రీదేవి అన్నారు. శనివారం అనిబిసెంట్ వర్ధంతి సందర్భంగా కళాశాలలోని సమావేశ మందిరం, అనిబిసెంట్ సర్కిల్‌లోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో విద్యావ్యాప్తికి అనిబిసెంట్ చేసిన కృషి మరువలేనిదన్నారు. హోమ్‌రూల్ ఉద్యమానికి నాయకత్వం వహించి, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడేందుకు ప్రజలను ప్రేరేపించిన విదేశీవనిత అనిబిసెంట్ అన్నారు. స్థానిక ప్రజల పేదరికం, నిరక్షరాస్యతను చూసి చలించి, వారి కోసం దివ్యజ్ఞాన సమాజం ద్వారా విద్యను వ్యాప్తి చేయడంలో భాగంగా బీటీ కాలేజీని స్థాపించారన్నారు. మదనపల్లె చరిత్ర ఉన్నంతవరకు అనిబిసెంట్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. బీటీ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.